ప్రజాశక్తి
సోమవారం 20 జనవరి 2025
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

సర్వే... రీస్టార్ట్..!

- నేటి నుంచి రీసర్వే ప్రారంభం
- పైలట్ ప్రాజెక్టుగా 22 గ్రామాలు
- 94 ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

భూముల రీసర్వే కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే కార్యక్రమాన్ని సోమవారం నుంచి తిరిగి ప్రారంభించనున్నారు. రైతుల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన గ్రామాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తొలి విడత పైలట్ ప్రాజెక్టుగా కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన 22 గ్రామాల్లో రీ సర్వే చేయనున్నారు. దీనికి 94 ప్రత్యేక బృందాలను నియమించారు. మొత్తం 30,434 ఎకరాల్లో రీసర్వే చేయనుండగా 200 నుంచి 250 ఎకరాలను ఓ బ్లాక్‌గా విభజించారు. ఈ బ్లాక్‌కు ఓ బృందం ఉంటుంది. ఆ బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఓ వీఆర్వో, ఓ వీఆర్‌ఏ ఉంటారు. సాంకేతిక సిబ్బంది ఒకరు సాయంగా ఉంటారు. 34 రోవర్లను సర్వేలో వినియోగించనున్నారు.

కృష్ణాజిల్లాలోని 502 గ్రామాల్లో 8,83,440 ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రెండు దశల్లో 290 గ్రామాల్లో మాత్రమే రీ సర్వే ప్రక్రియ పూర్తయింది. ఆ గ్రామాల్లోని 2,93,856.589 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశారు. మిగిలిన 184 గ్రామాల్లో 4,96,648.95 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉంది. గతంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. రీసర్వేలో ఈ ఫిర్యాదులు పరిష్కరిస్తారు. వైసిపి హయాంలో ఏర్పాటు చేసిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పోస్టునూ కొనసాగిస్తూ ఇటీవల కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈయన మండలంలో జరిగే రీసర్వేని పర్యవేక్షిస్తారు. పొలాల గట్లు, విస్తీర్ణాన్ని పక్కాగా కొలుస్తారు. ఎక్కడికక్కడ గ్రామ ప్రజలు, భూ యజమానుల సమక్షంలో రీసర్వే చేస్తారు.

రీసర్వే చేయనున్న గ్రామాలివే

కృష్ణాజిల్లాలో సోమవారం నుంచి రీ సర్వేను ప్రయోగాత్మకంగా చేపడుతున్నారు. జిల్లాలో 25 మండలాలు ఉండగా, ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేశారు. అయితే జిల్లాలో 22 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నారు. బాపులపాడు మండలం వెంకటరాజు గూడెం, నందివాడ (మిగతా 2లో)

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

- ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 36 టీమ్‌లు
- ఫిబ్రవరి నాటికి 524 మినీగోకులాలు పూర్తి
- పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు

ప్రజాశక్తి-విజయవాడ

ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ (జెడి) డాక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని 12 రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రకాల పశు వుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా విస్తృతస్థాయిలో నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా పశువుల ఆరోగ్య రక్షణకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు, మినిగోకులాలు తదితర అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు.

ప్రశ్న: పశుఆరోగ్య శిబిరాల ముఖ్యఉద్దేశం ఏమిటి?

జవాబు: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ రకాల పశువులు ఆరోగ్యంగా ఉండటానికి, (మిగతా 2లో)

ఆదిశేషు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

నిబద్ధత గల కమ్యూనిస్టు ఆదిశేషు

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-మోపిదేవి

పదవుల కోసమే రాజకీయాలు చేస్తున్న ఈ రోజుల్లో ప్రాణం పోయే వరకు ప్రజల కోసం శ్రమించిన కమ్యూనిస్టు నాయకుడు ఆదిశేషు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. సిపిఎం మోపిదేవి మండల కార్యదర్శి బండి ఆదిశేషు సంస్మరణ సభ మోపిదేవిలో ఆదివారం జరిగింది. సిపిఎం మండల కమిటీ సభ్యులు సిహెచ్.రాజశేఖర్ అధ్యక్షత (మిగతా 2లో)

బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పికొడదాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ

కేంద్రలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు తొత్తులా వ్యవహరిస్తూ రైతులు, కార్మికులపై దాడిని తీవ్రం చేసిందని, దీనిని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షక ఐక్యతా దినోత్సవ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతనాలు, రైతాంగానికి గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం వంటి వాటితో పాటు మొత్తం 13 డిమాండ్ల పరిష్కారం కోసం 1982 జనవరి 19న దేశవ్యాప్తంగా కార్మికవర్గం మొదటిసారి జాతీయ సమ్మె నిర్వహించిందన్నారు. ఈ ఆందోళనను అణచివేయటానికి నాటి కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందని, అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు చేస్తున్న వారిపై కాల్పులు జరపడంతో పది మంది అమరులయ్యారని, నాటి నుండి ప్రతి ఏటా జనవరి 19న కార్మిక, రైతు సంఘాలు ఐక్యతాదినం పాటిస్తున్నాయని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తిరోగమన, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశం పరిస్థితి అన్ని రంగాల్లో దిగజారిందన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మికచట్టాలను కాలరాస్తూ కార్మిక వర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చేలా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, దీనితో కనీసవేతనాలు, పనిగంటలు, ఉపాధి భద్రత, పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి పథకాల అమలు ప్రశ్నార్థకంగా మారతాయని అన్నారు. రైతాంగం సంవత్సరం పాటు పోరాడి రైతు వ్యతిరేక వ్యవసాయ నల్లచట్టాలను తిప్పికొట్టారని అయినా మోడీ ప్రభుత్వానికి బుద్ధి రాలేదని (మిగతా 2లో)

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

అడుగడుగునా తనిఖీలు

విమానాశ్రయంలో అమిత్‌షాకు వీడ్కోలు

గన్నవరంలో అమిత్‌షాకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం

అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేయాలని వామపక్షాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం కొండపావులూరులో జరిగిన అమిత్ షా కార్యక్రమంలో పోలీసులు అడుగడుగునా తనిఖీలతో హడావిడి చేశారు. ప్రతి వ్యక్తి జేబును తనిఖీ చేసి లోపలకు పంపించారు. తనిఖీల పేరుతో పోలీసులు చేసిన హడావిడిని పలువురు తీవ్రంగా వ్యతిరేకించారు. పాసులు లేవనే పేరుతో కొంతమందిని మెయిన్ గేటు వద్దనే నిలిపివేయడంతో మండిపడ్డారు. అమిత్ షా కార్యక్రమానికి 45 నిముషాలు ఆలస్యంగా వచ్చారు. 11 గంటలకు రావాల్సి ఉండగా 11.45కు సభాస్థలికి (మిగతా 2లో)

అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ

నిరసనలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన, అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో నిరసనలు హోరెత్తాయి. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని వామపక్ష నాయకులు నినాదాలు చేశారు. అమిత్ షా వైఖరిని ప్రజాతంత్రవాదులంతా ఖండించాలని కోరారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నాయకులు జి కోటేశ్వరరావు అధ్యక్షత జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ ప్రసంగించారు. విజయవాడలోని అంబేద్కర్ స్మృతివనం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడారు.

విజయవాడ ధర్నా చౌక్‌లో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

... వార్తలు మెయిన్, జిల్లా పేజీల్లో

మొదటిపేజీ తరువాయి

సర్వే... రీస్టార్ట్..!

మండలం చందుర్తిపాడు, పెదపారుపూడి మండలం పాములపాడు, గన్నవరం మండలం వెంకట నరసింహపురం, ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి, కంకిపాడు మండలం మరేడుమక్క, మొవ్వ మండలం వేములమడ, పెనమలూరు మండలం పెదపులిపాక, పమిడిముక్కల మండలం మర్రివాడ, ఉయ్యూరు మండలం జబరాల మారేడుమాకపూడి, తోట్లవల్లూరు మండలం ఐలూరు, నాగాయలంక మండలం టీ కొత్తపాలెం, కోడూరు మండలంలో పిట్టలలంక, అవనిగడ్డ మండలం దక్షిణ చిరివోలంక, మోపిదేవి మండలం ఉత్తర చిరివోలంక, చల్లపల్లి మండలం వక్కలగడ్డ, ఘంటసాల మండలం వేములపల్లి, మచిలీపట్నం నార్త్ మండలం బొర్రాపోతుపాలెం, పెడన మండలం బహుసాయినిపాలెం, గూడూరు మండలం కల్పటం, బంటుమిల్లి మండలం మల్లేశ్వరం, కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి గ్రామాల్లో రీసర్వే చేయనున్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు ఆదిశేషు

వహించగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లి ప్రజల సమస్యల పరిష్కారానికి ఆదిశేషు కృషి చేశారన్నారు. కోడూరు నుంచి అవనిగడ్డ వరకు రహదారి మరమ్మతులు చేయాలని చేపట్టిన పాదయాత్రలో ఆదిశేషు పాల్గొన్నారని చెప్పారు. ప్రజల తరపున నిలబడాలని, వారి సమస్యల పరిష్కారానికి తన శక్తి మేరకు కృషి చేశారని చెప్పారు. అతి సాధారణ జీవితం గడుపుతూ ప్రజల కోసం పని చేయడమంటే చిన్న విషయం కాదని, ఆదిశేషును ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు, నాయకులు పని చేయాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి ఎక్కడ అవసరమైతే అక్కడ ఆదిశేషు పని చేశారని తెలిపారు అవనిగడ్డ, మోపిదేవి, కోడూరు మండలాల్లో పేదల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు, కోడూరు మండలాల కార్యదర్శులు మేడంకి వెంకటేశ్వరరావు, పోలాబత్తిన మోహనరావు, కౌలు రైతు సంఘం నాయకులు పంచకర్ల రంగారావు, వాకా రామచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదిరామ్మోహనరావు, లోక్‌సత్తా నాయకులు నడకుదిటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ: జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రతి వ్యక్తి ఆచరించాల్సిన నైతిక విలువలను వెయ్యేళ్ల క్రితమే ప్రజా కవి వేమన తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి వ్యక్తి ఎలా జీవించాలి అనే అంశాలపై ఎన్నో వచన కవిత్వాలు, పద్యాలు యోగి వేమన రచించారన్నారు. ఆయన పద్యాలలో 'విశ్వదాభిరామ వినురవేమ' అనే వాక్యం తెలియని తెలుగువారు లేరన్నారు. యోగి వేమన తర్వాత తరంలో తెలుగు గడ్డపై జన్మించిన ఎంతోమంది కవులకు యోగివేమన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒక కవి అంతిమ లక్ష్యం సమ సమాజ స్థాపనే అనే అంశాన్ని వెయ్యి సంవత్సరాల క్రితమే ఆయన ప్రబోధించారన్నారు. నేటి తరం కవులు, రచయితలు కూడా యోగివేమన ఆశించిన జ్ఞానవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా రచనలు చేయాలని సూచించారు. ప్రధానంగా నేటితరం విద్యార్థిని విద్యార్థులు యోగివేమన రచించిన వేల పద్యాలను కంఠస్థం చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. కుల మతాలకు అతీతమైన వేమన భావజాలాన్ని నేటి తరం పౌరులు తెలుసుకోవడం ద్వారా ప్రజా కవి యోగివేమన రచించిన పద్యాలకు సార్థకత చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి నరసింహం,

డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆయన కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడు యోగి వేమన అన్నారు. సమాజంలోని మూఢాచారాలను నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యే భాషలో పద్యాలను వినిపించి అందరిని మెప్పించిన మహాకవి వేమన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ మనీషా, సిపిఒ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ పంచాయత్ లక్ష్యంగా గ్రామాల అభివృద్ధి

ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విజయవాడ పార్లమెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ఆదివారం గురునానక్ కాలనీ ఓ ప్రైవేట్ హోటల్లో ఎన్ఐఆర్‌డి ప్రతినిధులు, కలెక్టర్ లక్ష్మీశతో ఎంపి కేశినేని శివనాథ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలను వికసిత్ పంచాయత్ దిశగా అభివృద్ధి చేయడానికి అమలు చేయాల్సిన ప్రణాళికను ఎంపి వివరించారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వున్న 295 గ్రామాలను రెండున్న సంవత్సరాల్లోపు సమగ్ర అభివృద్ధి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో

ముందుగా పైలట్ ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు ఎన్ఐఆర్‌డి ప్రతినిధులు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి ఆరు గ్రామాలు ఎంపిక చేసి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి నాలుగు నియోజకవర్గాలకు కలిపి 32 మందికి హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డిలో శిక్షణ అందిస్తామన్నారు. పదిహేను రోజుల శిక్షణా కార్యక్రమం వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎన్ఐఆర్‌డి మద్దతుగా నిలబడుతుందన్నారు. వికసిత్ పంచాయత్ లక్ష్యంలో భాగంగా గ్రామాలను ఎనర్జీ సఫిషియేంట్ విలేజ్, హెల్తీ విలేజ్, చైల్డ్ వెల్ఫేర్ విలేజ్, వుమన్ ఎన్ పవర్మెంట్ విలేజ్, వుమెన్ ఫ్రెండ్లీ విలేజ్, పావర్టీ ఫ్రీ విలేజ్ (పేదరికం లేని గ్రామం)గా ఏ విధంగా తీర్చిదిద్దుకోవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించడంతో పాటు స్వయం ఉపాధి రంగానికి సంబంధించి కూడా శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఐఆర్‌డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజన్‌కుమార్ బాంజా, ఎన్ఐఆర్‌డి అధికారులు దిలీప్‌కుమార్ పాల్, మురళీకృష్ణ, ఒఎస్‌డి వెంకటరత్నం పాల్గొన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

పశువుల పోషణకు అధిక ప్రాధాన్యత, పశు ఉత్పత్తి పెంచేందుకు, వాటిల్లో వ్యాధుల నివారణకు ఇలా పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. దీనిలో భాగంగానే ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు పశుఆరోగ్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. ఇప్పటికే దీనిపై కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధానంగా గొర్రెలు, మేకలు, లేగదూడలు, పాడి పశువులకు నట్టల మందు ఉచితంగా అందిస్తారు. అలాగే గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందిస్తారు.

ప్రశ్న: పశు ఆరోగ్య శిబిరాల విజయవంతం చేసేందుకు ఎన్ని టీమ్‌లు, ఎంత మంది సిబ్బందిని కేటాయిస్తున్నారు?

జవాబు: ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలానికి రెండు టీమ్‌ల ఏర్పాటు చేస్తున్నాం. ఎన్‌టిఆర్ జిల్లా మొత్తంగా 36 టీమ్‌లు పని చేస్తాయి. ఒక్కో టీమ్‌లో పశు వైద్యాధికారి, పారా వెటర్నరీ కాంపౌండర్, పశు వైద్యసహాయకుడు (ఏహెచ్ఎ) ఉంటారు.

ప్రశ్న: పశువులు జిల్లాలో ఎన్ని ఉన్నాయి?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలో పెద్ద పశువులు రెండు లక్షల ఒక వెయ్యి ఉన్నాయి. అలాగే 32,200 దూడలు, రెండు లక్షల 60 వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి.

ప్రశ్న: దూడల ప్రదర్శన ఎన్ని చోట్ల ఏర్పాటు చేస్తున్నారు?

జవాబు: జిల్లా వ్యాప్తంగా 13 చోట్ల మేలు జాతి దూడల ప్రదర్శన సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో క్యాంప్‌లో 50 దూడల వరకు ఉంటాయి. రూ.140 విలువ కల్గిన మిరల్ బ్లాక్, టానిక్ ఇవ్వడం జరుగుతుంది. రైతుల్లో అవగాహన, వారిలో ఉత్సాహం నింపడానికి మేలు జాతి ప్రదర్శన ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయి. శిబిరాలకు వచ్చిన దూడలకు బహుమతులు కూడా ఇవ్వడం జరుగుతుంది.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ఏరియా పశు ఆస్పుత్రులు, 43 డిస్పెన్సరీలు, 41 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, 127 ఆర్ఎస్‌కెలు ద్వారా పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం జరుగుతుంది.

ప్రశ్న: జిల్లాలో మినీ గోకులాలు (పశువుల షెడ్లు) ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

జవాబు: జిల్లా వ్యాప్తంగా 524 మినీ గోకులాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో రైతు వద్ద ఉన్న పశువుల సంఖ్యకనుగుణంగా ఈ షెడ్లను ఏర్పాటు చేయించడం జరుగుతుంది. రెండు, నాలుగు, ఆరు పశువుల సంఖ్యకనుగుణంగా ఈ షెడ్లు ఉంటాయి. 10 నుంచి 12 వరకు మినీగోకులాల కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించాం. పశువుల షెడ్ల నిర్మాణానికయ్యే వ్యయంలో 10 శాతం రైతు వాటా సొమ్ము, మిగిలిన 90 శాతం వాటా సొమ్మును గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రైతులకు జమ చేయడం జరుగుతుంది. ఈ స్కీమ్‌కు సంబంధించి 1550 దరఖాస్తులు రాగా, 524 షెడ్ల నిర్మాణాలను ప్రారంభించడం జరిగింది. ఈ స్కీమ్ కింద 475 మాత్రమే జిల్లా టార్గెట్. సగటున 3,144 పశువులుండేటట్లు షెడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ షెడ్ల నిర్మాణం వచ్చే ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయడం జరుగుతుంది. ఈ షెడ్ల నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు కేటాయించారు.

అడుగడుగునా తనిఖీలు

చేరుకున్నారు. ఆయనతో పాటు సిఎం చంద్రబాబు కూడా వచ్చారు. అంతకు ముందు ఉదయం 11 గంటలకు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వచ్చారు. మెయిన్ రోడ్డు వద్ద టిడిపి కార్యకర్తలు జెండాలు పట్టుకుని వారికి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వచ్చారు. 11.48కి ఎన్ఐడిఎం ప్రాంగణాన్ని అమిత్ షా ప్రారంభించారు. దాని విశిష్టతను తెలుసుకున్నారు. చుట్టూ కొండలతో పచ్చదనంతో అలంకరించబడిన 22,800 చెట్లు ఉన్నట్లు అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. భవనంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లోపల ఉన్న వారిని ఎలా కాపాడాలో కళ్లకు కట్టినట్లు చూపించారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన పరికరాలను పరిశీలించారు. ఎన్ఐడియం డైరెక్టర్ జనరల్ పియష్ ఆనంద్ అతిథులను పరిచయం చేశారు. చివరిగా ప్రతిభ చాటిన అధికారులు, సిబ్బందిని అమిత్ షా, చంద్రబాబు, సత్కరించారు.

అమిత్ షాకు వీడ్కోలు

రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్ షాకు రాష్ట్ర నాయకులు వీడ్కోలు పలికారు. కొండపావులూరు ఎన్డీఆర్ఎఫ్ సభా ప్రాంగణం నుండి రోడ్డు మార్గాన గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం చేరుకున్నారు. అక్కడ నుండి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో సిఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, లావు శ్రీకష్ణదేవరాయలు, కనక మేడల రవీంద్రకుమార్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు రేంజ్ డీఐజీ జివిజి అశోక్ కుమార్, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ వీడ్కోలు పలికారు.

బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పికొడదాం

విమర్శించారు. బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల అవకాశవాద వైఖరిని ఎండగట్టాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సిహెచ్.సుప్రజ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.కళ్యాణ్‌కుమార్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తదితరులు పాల్గొన్నారు.

జయంతిరావుకు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ

రిటైర్డ్ అసిస్టెంట్ కమాండెడ్ కె.జయంతిరావు సంస్మరణ సభ బందర్ రోడ్డులోని నిర్మల హృదయ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిరావు చిత్రపటానికి నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి రావు గారి వద్ద తాను కూడా 1998లో శిక్షణ తీసుకున్నారని, వీరు వత్తిపట్ల నిబద్ధతతో వ్యవహారిస్తూ పలువురు అధికారులకు అత్యున్నత శిక్షణ ఇవ్వడం లో కీలకంగా వ్యవహారించారని అన్నారు. విధి నిర్వహణ లో అలుపెరగకుండా నిజాయితీగా ట్రైనీ సిబ్బంది క్రమశిక్షణ, సాహసం, నైపుణ్యం, వత్తి పట్ల పవిత్రమైన భావన వచ్చే విధంగా తీర్చిదిద్దడం లో ఆయనకు ఆయనే సాటి అని ప్రస్తుతం అయన మనతో లేకపోయినా అయన నేర్పిన అనుభవాలు ఎప్పటికి మనతోనే ఉంటాయాని, జయంతి రావు గారి స్ఫూర్తితో మనం ఎంతో నేర్చుకున్నాం, పోలీస్ శాఖలో అంత నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన శిక్షకుడిగా అందరినీ చాలా గొప్పగా తీర్చిదిద్ధిన జయంతి రావు గారికి మనం అందరం నివాళులు అర్పించడం సముచితం అని అన్నారు. ఈ నేపథ్యంలో నిర్మల్ హృదయ భవన్‌లో భోజనం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు మారుతీరావు, అంబికా ప్రసాద్, ధర్మేంద్ర, రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలని నిరసనలు

గుడివాడలో...

గన్నవరంలో...

గుడ్లవల్లేరులో...

కంకిపాడులో...

యనమలకుదురులో...

ప్రజాశక్తి-గన్నవరం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని వామ పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా గో బ్యాక్ అంటూ ఆదివారం గన్నవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కె.వెంకటేశ్వరరావు, జోషి, బేతా శ్రీనివాసరావు మాట్లాడారు. అమిత్ షాను మంత్రి వర్గం నుండి తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు. పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి ,కార్యవర్గ సభ్యులు కట్టవరపు విజయరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు,, సిపిఎం నాయకులు యం. ఆంజనేయులు, సూరగాని సాంబశివ రావు, ఉంగుటూరు మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, బాపులపాడు మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, బడుగు మరియదాసు, ఏసుదాసు. మిరవ నాగేశ్వరావు, ఉదయ్ , మద్దిరెడ్డి చిన్న, ,ఏసుదాసు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-కంకిపాడు : కేంద్ర హోంమంత్రి పదవికి అమిత్ షా రాజీనామా చేయాలని పెనమలూరు మండలం యనమలకుదురులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పెనమలూరు మండల కార్యదర్శి కాశీం, సిపిఐ పెనమలూరు నియోజకవర్గ నాయకులు మున్నంగి నరసింహారావు, రెడ్ ఫ్లాగ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు, సిఐటియు పెనమ లూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, సిపిఎం పెనమలూరు మండల నాయకులు షేక్ మస్తాన్ వలీ, సిపిఎం నాయకులు షేక్ బాబు, మహిళా సంఘం పెనమలూరు మండల కార్యదర్శి పాతాళ లక్ష్మి, మత్స్య కార్మిక సంఘం నాయకులు వాటపల్లి శ్రీరాములు పాల్గొన్నారు. అలాగే అమిత్ షా గో బ్యాక్ అంటూ కంకి పాడు మండలం సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని గొడవర్రు, కోమటిగుంట గ్రామాలలో నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, వి.మరియదాసు, వి.శివ శంకర్, జోజి, జాన్ మోజెష్, రవి పాల్గొన్నారు. ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా... గో బాక్...అంటూ సిపిఎం గుడ్లవలేరు మండల శాఖ అధ్వర్యంలో మండలంలోని 5 చోట్ల నిరసన ధర్నాలు ఆదివారం నిర్వహించారు. వడ్లమన్నాడు హరిజనవాడ ,కవుతరం చిన హరిజనవాడ అంబేద్కర్ విగ్రహాలవద్ద, అంగలూరు వెలగ చెట్టు సెంటర్, అంగలూరు, చంద్రాల హరిజనవాడ అంబేద్కర్ విగ్రహాలవద్ద ధర్నాలు నిర్వహించారు. సిపిఎం గుడ్ల వల్లేరు మండల బాధ్యులు బి.వి.శ్రీనివాసరావు, కటికల యాకోబు, కె రాంబాబు, కె రమేష్, సురేష్, మేకల యేసు రత్నం, మద్దాల రాజేష్, మేడేపల్లి వెంకటేశ్వరరావు, దావులూరి అజయ్కర్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు. ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, చింతలూరి సత్యనారాయణల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు లంకా సురేంద్ర, ఆర్.కొండ, కొమ్ము సురేష్, కొమరవోలు లక్ష్మణరావు, అరుణ, వేసపోగు యేసయ్య, నారాయణ, వెంకటేశ్వ రరావు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, నాంచారయ్య, ఎలీషారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కోదూరు : కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామ సమీపన ప్రధాన పంట కాలువలో గుర్తుతెలియని యువకుని మృతదేహం కాలువలోని చెట్ల మధ్య ఉందని, ఆదివారం స్థానిక వీఆర్వో ఇచ్చిన సమాచారంతో మతదేహాన్ని వెలుపలకు తీయించి కేసు నమోదు చేసినట్లు కోదూరు ఎస్సై చాణిక్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతుని రెండు చేతులకు, పొట్ట మీద, మెడ బాగాన పచ్చబొట్లు ఉన్నాయని, అలాగే వైట్ కలర్ ఫుల్ హాండ్ షర్ట్ ధరించి ఉన్నాడని అన్నారు.

మరో ఆరుగురు నిందితులు సరెండర్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం టిడిపి ఆఫీస్ పై దాడి కేసులో మరో ఆరుగురు నిందితులు సిఐడి పోలీసుల వద్ద సరెండర్ అయ్యా రని తెలిసింది. అయితే ఆదివారం వారిని గన్నవరం సెంటర్లో అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు కేసులో చూపించారు. అదుపులోకి తీసుకున్న వారిలో తేలప్రోలుకు చెందిన వింత ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యే వంశీ పిఎ గద్దె సుధీర్, డ్రైవర్ కోటి, గన్నవరానికి చెందిన దీపు, బాపులపాడుకు చెందిన కమలాకర్ మరో వ్యక్తి ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో 17 మందిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం 89 మందిని నిందితులుగా పోలీసులు చేర్చారు ఇదే కేసులో ఏ 71 గా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కూడా ఉన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురు ఇప్పటికీ పరారీలో ఉన్నారు. వారికోసం సిఐడి పోలీసులు బృందాలుగా గాలిస్తున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలం లోని వడ్ల మన్నాడులో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్తో రెండు పూరిల్లు, ఒక రేకుల షెడ్డు దగ్ధం అయ్యాయి. జంగం శ్రీనివా సరావు, జంగం ముస లయ్యకు చెందిన రెండు పూరిళ్ళు, నత్త సుబ్బారావు రేకుల షెడ్డు, మైక్ సెట్ బ్యాటరీలు అగ్నిలో ఆహుతయ్యాయి. సర్వం కోల్పోయిన కుటుంబాలు రోడ్డున పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్ కటికల జ్యోతి లత సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధ్యతలను ఓదార్చారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మోపిదేవి : మండలంలోని నాగాయతిప్పలో .జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగాయతిప్ప పోస్ట్ ఉమెన్ గా పనిచేస్తున్న నడకుదిటి భాగ్యలక్ష్మి ఆమె భర్త వాహనం మీద మోపిదేవి వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఘటనా స్థలంలో తీవ్ర గాయాలు పాలయ్యిన భాగ్యలక్ష్మీని, ఆమె భర్త ని హుటాహుటిన స్థానికుల సహాయంతో 108 వాహనంలో అవనిగడ్డ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో పంట పొలాలు ట్రాన్స్ ఫార్మర్ ఉన్న విద్యుత్ వైర్లను దొంగలు కత్తిరించుకుపోయారు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు.ఇప్పటికే పొలాల్లో పలు మార్లు విద్యుత్ వైర్లు దొంగతనాలు జరిగాయని చెప్పారు. తాజాగా 25 బోర్ వేల్ మోటర్లు విద్యుత్తు వైర్లు కట్ చేసినట్లు తెలిపారు రైతులు ఆళ్ల భాను ఆవాలు జోజి బాబు, నూకల మహేష్, నువ్వుల శ్రీనివాసరావు పోలీసులను కలిసి సమస్యపై ఫిర్యాదు చేశారు. వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణితేజ కు నివాళులు అర్పిస్తున్న ఎంఎల్ సి మొండితోక అరుణ్ కుమార్

వీరమణి తేజకు నివాళులు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ నియోజకవర్గం, చందర్లపాడు, ముప్పాళ్ళ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నల్లాని వీరమని తేజ సంస్మరణ కార్యక్రమంలో ఆదివారం ఉమ్మడి కష్ణాజిల్లా శాసన మండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు. మణితేజ చిత్రపటానికి పూలమాలు లేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యు లను కలిసి ధైర్యం చెప్పి, సంతాపాన్ని తెలియజేశారు, వారి కుటుంబానికి అన్నివిధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసాని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ: నందిగామ నియోజకవర్గం తోట రావులపాడు గ్రామంలో ఆదివారం సిఎస్ఐ చర్చి నిర్మాణానికి ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శంకు స్థాపన చేశారు. దైవ సేవకులు, సంఘస్తులు, క్రైస్తవ సోదర సోదరీమణులు , కూటమి నాయకులు సిఎస్ఐ చర్చి శంకుస్థాపన (భూమి పూజ) కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విక్కుర్తి శ్రీనివాస్

ప్రజాశక్తి-మోపిదేవి : రెండు కాళ్లు తొలగించాల్సిన నిర్భాగ్యు రాలికి ఆదివారం పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.మోపిదేవి ప్రశాంత్ నగర్ వాసి కాకి నాగమణి అనే మహిళ షుగర్ వ్యాధితో తన రెండు కాళ్లు చచ్చుబడి అనేక హాస్పిటల్స్ తిరిగిన ప్రయోజనం లేక రెండు కాళ్లు తొలగిం చాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించడానికి దారి ఖర్చులు, వైద్య ఖర్చుల నిమిత్తం చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సాయం కోరుతున్నారని సోషల్ మీడియాలో వచ్చిన వార్తకు విక్కూర్తి స్పందించారు. ఆర్థిక సాయం అందించడంతోపాటు రుయా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేందుకు కషి చేస్తామని తెలిపారు. విక్కుర్తి ఆర్థిక సాయం వ్యక్తిగత భరోసా తో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

సిఐటియు కృషితో ఎల్ఇడి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - గుడివాడ : ఎంతో కాలంగా గుడివాడ ఆటోనగర్లో వీధిలైట్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యామని నేటికి సిఐటియు కృషి ఫలితంగా ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణ రావు పేర్కొన్నారు. అనేక సమస్యల్లో ఒకటైన వీధిలైట్ల సమస్యను ఐల డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో 20 ఎల్ఈడీ లైట్లను ఆదివారం ఆటోనగర్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆటోనగర్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ఆటోనగర్లో ఉన్న మౌలిక సమస్యలపై గత సంవత్సర కాలంగా ప్రభుత్వ అధికారులకు ఎన్నోసార్లు మొమరాండం రూపంలో తెలియ జేశామన్నారు. నేటికి ఆటోనగర్ ఎల్ఇడి లైట్ల వెలుగుతో కళకళలాడుతూ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు బొబ్బరుపల్లి ఆంజనేయులు, రెడ్డి నాగరాజు, అన్నమనేడి వెంకటరమణ, నాయకులు ఎస్ ఎమ్ మోహిద్దీన్ భాషా, కల్వకుంట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున బల్లకట్టు ప్రయాణం

ప్రజాశక్తి - నందిగామ : ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా నదిలో గుడిమెట్ల (రామన్నపేట)-పుట్లగూడెం బల్లకటు ప్రమాదకరంగా మారింది. గుడిమెట్ల (రామన్నపేట)-పుట్లగూడెం బల్లకటు యాజమాన్యాలు అధికారులకు సవాల్ విసురుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతి రాజ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చందర్లపాడు మండలం గుడిమెట్ల కృష్ణానది రీచ్‌లలో సాగుతున్న బలకట్టు ప్రయాణాలు ప్రమాదపు అంచున సాగుతున్నాయి. జిల్లా పరిషత్ వారు ఇచ్చిన సమయం ఉదయం 6 గటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే. కానీ రామన్నపేట బలకట్టు యాజమాన్యం మాత్రం సమయంతో పని లేదంటూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. గుడిమెట్ల బలకట్టు వద్ద ప్రభుత్వం మనుషులకు ద్విచక్ర వాహనాలకు త్రీ వీలర్ ఆటోలకు మాత్రమే పర్మిషన్ ఇస్తే బల్లకట్టు యాజమాన్యం మాత్రం 14 టైర్ల లారీలు హెవీ లోడ్‌తో ఎక్కించి లాభమే ధ్యేయంగా రవాణా సాగిస్తున్నారు. ఆయా జిల్లా పరిషత్ యంత్రాంగం ద్వారా నామమాత్ర రుసుములతో రవాణా హక్కులు దక్కించుకున్న నిర్వాహకులు, ధనార్జనే ధ్యేయంగా నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల భద్రతను 'గాలిలో దీపం'గా మారుస్తున్నారు. అనుమతి మంజూరు సమయంలో పేర్కొన్న

నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కి'కృష్ణార్పణం' చేస్తున్నారు. సరైన శిక్షణ లేని వారిని బలకట్టు నడిపేందుకు నియమించుకుంటున్నారు. బల్లకట్టులోని ప్రయాణికులకు నదీ గర్భంలో భద్రత కోసం ఉంచాల్సిన లైఫ్‌జాకెట్‌లు కనీస వసతి ఉండకపోవటం ఆశ్చర్యం వేస్తుంది. జిల్లా పరిషత్ వారు నిర్వహించిన ఛార్జీలు ఆధారంగా ఒక బోర్డు ఏర్పాటు చేయాలని లేకపోతే మా దగ్గర అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ప్యాసింజర్లు వేడుకుంటున్నారు. ప్రాణ నష్టం జరుగక ముందే అధికారులు మండల, జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి, నిబంధనలు అమలు జరిగేలా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఒక వ్యక్తి హత్యకేసులో ముద్దాయిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 16 రాత్రి జగ్గయ్యపేట పట్టణం సత్యనారాయణ పురానికి చెందిన యర్రంశెట్టి ఆంజనేయులును గుర్తుతెలియని వ్యక్తి హత్య చేసిన సంఘటనపై, వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, దర్యాప్తు అధికారి జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు ముద్దాయి డాంగే నగర్‌కి చెందిన బెల్లంకొండ నరేష్‌ను 18న అరెస్ట్ చేశారు. అతన్ని ప్రశ్నించగా తన తల్లి, తన తండ్రిని వదిలేసి మృతుడు యర్రంశెట్టి ఆంజనేయులుతో సహజీవనం చేస్తున్నందున, ఆ విషయమై కుటుంబంలో కలహాలు వచ్చాయన్నారు. దానిపై కక్ష పెట్టుకొని యర్రంశెట్టి ఆంజనేయులును హత్య చేసినట్లు నరేష్ నేరం ఒప్పుకున్నారు. అనంతరం ముద్దాయిని అరెస్ట్ చేసి జగ్గయ్యపేట కోర్టులో హాజరు పరచగా కోర్టు వారు 14 రోజులు రిమాండ్ ఇచ్చినట్టు సిఐ తెలిపారు.

'స్ఫూర్తి' శ్రీనివాస్‌కి 2025 జాతీయ పురస్కారం

విజయవాడ : నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు స్ఫూర్తి శ్రీనివాస్ 2025 సంక్రాంతి పురస్కారం, చిత్రకళా రత్నబిరుదు, స్వర్ణ కంకణం బహూకరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కరీంనగర్‌కు చెందిన 'శ్రీ ఆర్యాణి సకల కళా వేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవ సంస్థ' ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డు కార్యక్రమంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో ఈ పురస్కారం అందజేశారు. 'పిచ్చుకను చేసుకుందామా మచ్చిక' అనే నినాదంతో జాతీయ స్థాయిలో చేసిన సేవ్ స్పారో ఉద్యమానికి, కళనీ కళా సంస్కృతిని పెంపొందించే క్రమంలో 20 సంవత్సరాలుగా చేసిన సేవలకు 100 పైగా నిర్వహించిన ఆర్ట్ ఈవెంట్స్‌కు 30 సంవత్సరాలుగా చిత్రకళోపాధ్యాయుడిగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆదివారం అందుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ

పురస్కారం అందుకుంటున్న స్ఫూర్తి శ్రీనివాస్

జాతీయ స్థాయి అవార్డులు కళాకారుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా తన బాధ్యతను మరింత పెంచిందని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

నివాస గృహంలేని పేద సర్పంచ్

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులు పెడుతున్న అగ్రవర్ణ పెత్తందారులు

ఎస్‌సి సర్పంచ్ కావడమే నేరం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం, కూనపరాజుపర్వ గ్రామ సర్పంచి మాతంగి వెంకటేశ్వరరావు సామాజిక ఆర్థిక పరిస్థితి చూస్తే ఆశ్చర్యంగా కనిపిస్తుంది. ఆయనకు ఉన్న మాట మంచితనమే రాజకీయాల్లో నిలబెట్టిందని, అందరిలో అందరికీ కావాల్సిన వ్యక్తిగా గుర్తింపు పొందిన ఈయన 1995లో ఎంపిటిసిగా గెలుపొందారు. దీంతో ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాలు ఎంపీపీగా పదవిని చేపట్ట వలసి ఉన్నప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితులు వలన ఆ పదవి దక్కలేదు. ఆ తర్వాత 2014లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ముక్కోణం పోటీలో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ మాతంగి వెంకటేశ్వరరావు జనంలోనే ఉంటూ 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి సుమారు 1100 పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కానీ అప్పటి నుండి గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గత వైసీపీ ప్రభుత్వం నిధుల మంజూరులో అలసత్వం కారణంగా తప్పని పరిస్థితిలో గ్రామ పంచాయతీ కార్మికుల అలవెన్సులు, పనులు చేసేందుకు సర్పంచి వెంకటేశ్వరరావు అప్పులు చేసి పరిపాలన కొనసాగిస్తూ వస్తున్నారు.



2024లో దేశంలో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత గ్రామ పంచాయతీల్లో పనులు చేశామంటూ, ఆ పనులు చేసినందుకుగాను తామే బిల్లులు చేసుకుని డబ్బులు డ్రా చేసుకుంటామని నేటి అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఎస్‌సి, సర్పంచ్ అయిన తనను అనేక ఇబ్బందులు పెడుతున్నారని మాతంగి వెంకటేశ్వరరావును ఆవేదన వ్యక్తం చేస్తున్నారని రూ.2021 నుంచి గ్రామ పంచాయతీ అభివద్ధికి లక్షల రూపాయలు అప్పులు చేస్తూ నెట్టుకొస్తున్న తనకు బిల్లులు కాకుండా ప్రత్యేక అధికారుల పాలనలో ఏం చేసారో కూడా తెలియని పనులకు ఇప్పుడు బిల్లులు అంటూ నేటి అధికార పార్టీ నేతలు అడ్డుకుని ఎస్సీ సర్పంచ్ అయిన తనను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో తమ సొంత ఇల్లు పడిపోవడంతో వారి బంధువులు పశువుల కోసం వేసిన రేకుల షెడ్డులో ఉండటం చూస్తే ఈ రోజుల్లో కూడా ఒక ప్రధాన రాజకీయ పార్టీ పక్షాన ప్రజాప్రతినిధిగా ఉండటం చెప్పుకోదగ్గ విషయమే.

సర్పంచ్ వెంకటేశ్వరరావు నివసిస్తున్న రేకుల షెడ్ ఇదే...

అమెరికా నుంచి తిరిగొచ్చిన స్వామిదాస్

ప్రజాశక్తి - తిరువూరు : అమెరికా పర్యటన ముగించుకుని ఆదివారం తిరువూరు చేరుకున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్‌కు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. తిరువూరు శాంతినగర్‌లోని స్వామి దాస్ ఇంటికి వెళ్లి స్వామిదాస్ దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పిటిసి సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, పార్టీ నాయకులు ఆయనను కలిశారు.

రోడ్డే మందుబాబులకు విశ్రాంతి స్థలం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం లోని భారత్ టాకీస్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపుల వద్ద మందుబాబులు సోయ లేకుండా నడిరోడ్డుపై వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నడిరోడ్డుపై తప్ప తాగిన మందుబాబు ఇలా విశ్రమించాడు. దీనితో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ అక్కడ ఉన్న వైన్‌షాప్ యాజమాన్యాలు కానీ, ట్రాఫిక్ పోలీసులు కానీ పట్టించుకోలేదు. అసలే ప్రధాన రహదారి. ఆపై నిత్యం స్కూల్ విద్యార్థులు, వివిధరకాల పనుల నిమిత్తం మహిళలు, చందర్లపాడు మండలానికి చెందిన పదికి పైగా గ్రామాల ప్రజలు, ఆటోలు, ఇతర వాహనాల్లో ఈ రహదారి వెంట నిత్యం ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ ఉదయం సాయంత్రం వేళల్లో ఉండి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ ప్రాంతం నుంచి వైన్‌షాప్‌లను పట్టణ శివారు ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు స్థలం ఎంపిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణ కమిటీ, ఉత్సవ కమిటీ హిందూ చైతన్య వేదిక కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని విజయవాడ రోడ్లో తొర్రగుంటపాలెం సెంటర్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలంగా కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, పిన్నం వెంగళరావు, సంకా భాస్కర్, తూములూరి అశోక్, నోముల రఘు, అల్లి రవిచంద్ ఎంపిక చేశారు. చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని జె.విష్ణు అందజేస్తానని తెలిపారు. విగ్రహ ఏర్పాటు చేయబోయే స్థలం చైర్మన్ రాఘవేంద్ర ఆ ప్రాంతాన్ని పరిశీలించి విగ్రహ ఏర్పాటుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం ఫిబ్రవరి 19న నిర్వహించనున్నట్లు నిర్మాణ కమిటీ తెలిపారు.

వాహనదారులకు హెల్మెట్లు తప్పనిసరి

ప్రజాశక్తి - కంచికచర్ల : రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని నందిగామ ఎసిపి తిలక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కంచికచర్ల మండలం పరిధిలో కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద ఆదివారం వాహనదారులకు పలు సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ సీట్‌బెల్ట్ పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. జాగ్రత్తలు పాటించడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. రోడ్డు భద్రతలు పాటించకుండా వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదానికి గురైతే మనల్ని నమ్ముకొని ఉన్న కుటుంబం రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్క వాహనదారులు హెల్మెట్ సీటు బెల్టు వినియోగించి ప్రయాణాలు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి జగ్గయ్యపేట : పట్టణంలో స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ 'నేను సైతం హృదయ స్పందన సేవ కార్యక్రమంలో భాగంగా వేల్పుల మాణిక్యారావు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పటలు, పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మన జగ్గయ్యపేటను కూడా స్వచ్ఛ జగ్గయ్యపేటగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని వార్డులు, పచ్చని చెట్లు, పరిశుభ్రం, పచ్చదనంతో ఉండాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మన రాష్ట్రంలోనే మన జగ్గయ్యపేట పట్టణం పారిశుధ్య కార్యక్రమంలో ప్రథమ స్థానంలో ఉండాలని హృదయ స్పందన సేవ సంఘ అధ్యక్షుడు వేల్పుల మాణిక్యారావు తెలిపారు.

నెట్టెం రఘురాంకు వినతిపత్రం ఇస్తున్న సురేష్

మార్కెట్ చైర్మన్ పదవి కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా తన భార్య మాడుగుల ప్రమీలకు కేటాయించాలని కోరుతూ ఆదివారం మాజీమంత్రి నెట్టెం రఘురాం, స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్‌లకు రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి మాడుగుల సురేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాడుగుల సురేష్ మాట్లాడుతూ మొదటిసారిగా అగ్రికల్చర్ మార్కెట్ యాడ్ చైర్మన్ ఎస్సీ కేటగిరిగా కేటాయించబడిన సందర్భంగా ఈ అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ అవకాశాన్ని తన భార్యకు కల్పించాలని కోరారు.

మర్లపాలెం-తెంపల్లి రోడ్డు గుంతలమయం

గతుకులమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని మర్లపాలెం-తెంపల్లి గ్రామాల రహదారి గుంతలమయంగా మారింది. రైల్వే ట్రాక్ వద్ద నుంచి తెంపల్లి వరకు రహదారి గోతులు పడింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. అయితే రోడ్డు అడుగడుగునా గుంతలు పడి నడ వటానికి కూడా వీలు లేకుండా ఉంది. ఈ రహదారి ఆర్అండ్ బీ పరిధిలో ఉంది. రోడ్డు దాదాపు 2 కిలో మీటర్ల మేర ఉంది. గ్రామంలోనే దాదాపు కిలోమీటర్ మేర రోడ్డు విస్తరించి ఉంది. తెంపల్లి నుంచి మర్లపాలెం మీదుగా గన్నవరానికి ప్రతి రోజూ, ఆటోలు దాదాపు 70 వరకు తిరుగు తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు నిత్యం రాకపోకలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది.

వాహనదారుల ఆందోళన

గన్నవరం నుంచి మర్లపాలెం చెరువు వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. చర్చి వద్ద, పాత దళిత వాడ ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారిపై తారు మాయమై, మట్టి రోడ్డుగా మారి గుంతలు దర్శ నమిస్తున్నాయి. డ్రెయినేజీలు లేక పోవటంతో రోడ్డు పైకి మురుగునీరు చేరుతుంది. చినుకు పడితే రోడ్డు పైనే మురుగునీరు పారుతోంది. రోడ్డు గుంతల మయంగా అధ్వానంగా మారటం తో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామ మలుపు వద్ద గుంతలు తప్పించపోయి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అసలే రోడ్డుపై గుంతలు ఉండగా దీనికి తోడు ఎగుడుదిగుడుగా స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రధాన రహదారిని వెంటనే నిర్మించి ప్రమాదాలు నివారించి చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

నిత్యం ట్రాఫిక్ ఉండే ఈ రోడ్డు పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆర్అండ్ పరిధిలో ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజల సమస్యలు గుర్తించి గతంలో మరమ్మతులు చేయించారు. రోడ్డు గుంతలు పడి సమస్యగా మారి నందున వెంటనే కొత్త రోడ్డు వేయాలని కోరుతున్నారు.

సబ్ జైలును పరిశీలించిన న్యాయమూర్తి జయలక్ష్మి, జిల్లాస్థాయి అధికారులు

ఖైదీల పట్ల వివక్షత వద్దు : జడ్జి

ప్రజాశక్తి-గన్నవరం : ఖైదీలను వివక్షతతో చూడకూడదని గన్నవరం కోర్టు న్యాయమూర్తి, మండల్ లీగల్ సర్వీసెస్ చైర్మన్ కే.జయలక్ష్మి అన్నారు. ఆదివారం గన్నవరం సబ్ జైలును ఆమె జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. జైలులోని రికార్డులను చూశారు. అనంతరం ఖైదీలతో కాసేపు మాట్లాడారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జైలుకు రావడానికి వెనుక గల కారణాలను గ్రహించుకుని, మరోసారి ఇక్కడకు రాకూడదన్నారు. జైల నుంచి బయటకు వెళ్లిన తర్వాత మంచి మనుషులుగా సమాజంలో మెలగాలని చెప్పారు. సబ్ జైలులోని అధికారులు, సిబ్బంది ఖైదీలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. న్యాయపరమైన సలహాలు ఏమైనా కావాలంటే మండల్ లీగల్ సెల్ సర్వీస్ స్టేషన్ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి విక్టర్ బాబు, వైద్యాధికారులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్మిక కర్షక మైత్రి దినోత్సవ కార్యక్రమాల సందర్భంగా బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్లో మైత్రి సభ నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు బంటుమిల్లి మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నియంత పరిపాలన సాగుతుందని, రైతుల కోసం చట్టాలు చేయాలని రైతులు నిరాహారదీక్ష చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గతంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకురాగా వాటి కోసం దాదాపుగా 13 నెలలు పోరాటం చేసి 750 మందిని ప్రాణాలు అర్పించారని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తా చట్టం చేస్తామని అప్పుడు కేంద్రం చెప్పి ఇంతవరకు ఏమి చేయలేదని దుయ్యబట్టారు. రైతులకు కార్మికులకు న్యాయం జరిగేంత వరకు ఈ ఐక్యత పోరాటాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుజ్ఞాన జనార్దన్‌రావు, అబ్బూరి కిరణ్, నీలిపూడి రంగారావు, సిఐటియు నాయకులు వంగలరాజు, ఆకునూరి వెంకటేశ్వరరావు, చొప్ప బాజీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ అధ్యక్షులు డాక్టర్ వేములపల్లి సురేష్ దాతృత్వంతో ఒక వ్యక్తికి కంటి చూపు లభించింది. పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన కాకాని గౌరీశంకర్ విజయవాడ పీవీపీ సిద్దార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ల్యాబ్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. అతను కంటిలోని రెటీనాను ప్రభావితం చేసి రాత్రి అంధత్వం బారిన పడి క్రమేపి పరిధి, రంగు కోల్పోయి అంధత్వం బారిన పడేసే రెటినిటిస్ పిగ్మెంటోసా అనే వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆర్థిక సహాయం కోసం మండల పరిధిలోని పురిటిగడ్డలో ఉన్న ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతులను సంప్రదించి సహాయం కోరాడు. దీంతో అతనికి సురేష్ - రోజా దంపతులు తమ ఐవీఎం ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో ఐవీఎం ఫౌండేషన్కు కతజ్ఞతలు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో 'కొమ్మారెడ్డి' విద్యార్థుల ప్రతిభ

బహుమతులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : మచిలీపట్నంలోని యస్‌యస్ఆర్ డిగ్రీ కళాశాలలో మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ వారు నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థులకు జాతీయ సమైక్యత అనే అంశం పై నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో తమ విద్యార్థులు బహు మతులు సాధిం చారని బంటుమిల్లిలోని కొమ్మారెడ్డి స్కూలు డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబూరి గీతికాప్రియ (8 వ తరగతి) జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, అజ్మీరా రఘు రామ మహర్షి (8వ తరగతి) జిల్లా స్థాయిలో తతీయ స్థానం సాధించారన్నారు. అలాగే తోట సాయి నాగ సమంత్ (8 వ తరగతి), ప్రత్తి మహీధర్ (7వ తరగతి) లకు కన్సోలేషన్ బహుమతులను సాధించార న్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ శోభ, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హంసలదీవిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-కోడూరు : ప్రసిద్ధి పర్యాటక ప్రదేశంగా పేరుగాంచిన హంసలదీవి (పాలకాయతిప్ప) బీచ్ వద్దకు ఆదివారం సంక్రాంతి సెలవులు చివరి రోజు కావడంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో సాగర తీరానికి చేరుకున్నారు. యువత కేరింతల కొడుతూ ఆటపాటలతో గడిపారు. మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి సూర్య నమస్కారాలు ఆచరించారు. మెరైన్ సిఐ సురేష్ రెడ్డి బీచ్ వద్దకు వచ్చిన పర్యాటకులకు సముద్రంలో స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు. మెరైన్ ఎస్సై ఉజ్వల్, మాధురి, రైటర్ రెహమాన్ జానీ, కోడూరు పోలీసులు, మెరైన్ పోలీసులు తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.

కొండాలమ్మ దేవస్థానంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామములో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. అమ్మవారిని సుమారు 25 వేల పైగా భక్తులు దర్శించుకోగా, అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకునేందుకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగ కుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ, వారి సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు. శ్రీ కొండలమ్మ అమ్మవారిని కైకలూరు సీనియర్ సివిల్ డివిజనల్ జడ్జ్ వి వీర నాగ వెంకట లక్ష్మి, మచిలీపట్నం స్పెషల్ మొబైల్ జడ్జి ఎం. వెంకట వాహిని అమ్మవారిని దర్శించు కున్నారు. వారికి విశేషమైన పూజలు చేయించి శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేశారు.

జడ్జికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగు తుందన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోషియేషన్ కృష్ణాజిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్ష ,కార్యదర్శులుగా కె వి. లోకేశ్వరరావు, కె వి రమణ ఎన్నికవ్వగా సహధ్యక్షునిగాను పి.ఆదిశేషు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా పివి. నాగేంద్రరావు, కెఎన్‌వి ప్రసాద్, ఎం వి పి.శ్రీదేవి ,సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ వహాబ్, వి. శ్రీనివాసరావు, పి రోజా, కోశాధికారిగా ఏ.సోమశేఖర్ ఎన్నికయ్యారు.

అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ నిరసనలు

భారత రాజ్యాంగం రూపకర్త డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ పై రాజ్యసభలో అవమానకరమైన వ్యా ఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటన వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కెవిపిఎస్, సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అంబేద్కర్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - విస్సన్నపేట : అమిత్ షా రాకను వ్యతిరేకిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో విస్సన్నపేట అంబేద్కర్ సర్కిల్ నందు ఆదివారం నిరసన వ్యక్తం చేయడం జరిగింది. కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మేకల జ్ఞానరత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు సిఐటియు అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు సిపి ఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్ లో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం, ఎస్. వెంకటేశ్వర్లు, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **నందిగామ :** అంబేద్కర్‌ను దుర్భాలాషలాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నందిగామ గాంధీ సెంటర్‌లో నిరసన తెలిపారు. సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వానికి మద్దతు పలికిన టిడిపి, జనసేన ప్రజలకు ఎం.సమాధానం చెప్తారని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కరి వెంకటేశ్వరరావు, గోపి నాయిక్, శ్రీనివాసరావు, ఎవి నారాయణ, హస్సన్, ఎసోబు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు ఎవి నారాయణ, జాతీయ మీడియా జాతీయ మీడియా సంఘ నాయకులు పఠాన్ మీరా హుస్సేన్ సంఘీభావం తెలిపారు. **మైలవరం :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను అవమానపరిచిన కేంద్రమంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ ఆదివారం స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోగా తెలుగుదేశం, జనసేన, వైసిపి కూడా అమిత్ షా వ్యాఖ్యలను సమర్థిస్తున్నారని ఇంతకంటే నీచమైన చర్య మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రావూరి రమేష్ బాబు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు మారేశ్వర రావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. **ఏ.కొండూరు :** ఎ.కొడూరు మండలం చీమలపాడు మెయిన్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల అమ్మిరెడ్డి, పంబి వెంకటేశ్వరరావు, రావుల రామకృష్ణ, సోమా ఆనందరావు, మేకల నాగరాజు, టి.లక్ష్మ య్య, పి. లెనిన్, పంబి చిన్న యోబు, చిట్టిబాబు, జల్దీ ఏలియా తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** జగ్గయ్యపేటలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి మాట్లాడారు. ఈ సందర్భంగా అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసరి నాగేశ్వరరావు, రావెళ్ళ శేషు, తదితరులు పాల్గొన్నారు. **జి కొండూరు :** మండల సిపిఎం సీనియర్ నాయకులు మాజీ మండల కార్యదర్శి పంది సాంబశివరావు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ డైరెక్టర్ బట్టపర్తి రాజు, సిపిఎం శాఖ కార్యదర్శి ప్రసాద్ అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

ఎ.కొండూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

జగ్గయ్యపేటలో...

మైలవరంలో...

నందిగామలో...

తిరువూరులో...

నాయి బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి- నందిగామ :

నాయి బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివరావు పేర్కొన్నారు. నందిగామ పట్టణం పవన శ్రీ పాలి క్లినిక్‌లో నందిగామ నాయి బాహ్మణుల సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివరావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు తెలుగుదేశం ప్రభుత్వంలోని గుర్తింపు ఉంటుందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్ లో డీఎస్సీ కోచింగ్ ఉచితంగా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దేవాలయాల్లో పనిచేసే నాయి బ్రాహ్మణులకు 15 వేల నుండి 25 వేలకు జీతాలు పెంచారని తెలిపారు. డైరెక్టర్ సురవరపు నాగరాజు, డైరెక్టర్ మానుకొండ రమేష్, నాయి బ్రాహ్మణ వైద్య విభాగం అధ్యక్షుడు దాసు వెంకట నాగేశ్వరరావు, అన్నవరపు గణపతి రావు, బట్లూరి రమేష్, మునుకొండ శివ, దాసు జయరాం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

రైతుల పట్ల కూటమి ప్రభుత్వం మోసం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : 9 గంటల ఉచిత విద్యుత్ ఒక గంట తగ్గించి 8 గంటలకు కుదించి, మరలా ఒక గంట తగ్గించి 7 గంటలు మాత్రమే ఇస్తూ ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు చెప్పిన కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం రైతులకు ఉచిత కరెంటుపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 9 గంటల ఉచిత కరెంటు ఇవ్వకపోతే పంట వరి, మొక్కజొన్న, మిర్చి ఎండిపోయే అవకాశం ఉంటుందన్నారు. గత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయంలో రైతులకు ప్రతి ఏటా పంపిణీ చేసిన రైతు భరోసాను పెంచి రైతులకు మరింత మేలు చేస్తామని చెప్పి రైతాంగాన్ని దగా చేసి రైతులకు ఆర్థిక సహాయం చేయకుండా రైతుల నడ్డి విరిచారు అన్నారు. ఈ కార్యక్రమంలో హై కోర్ట్ అడ్వకేట్, రాష్ట్ర బీసి చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, జగ్గయ్యపేట పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, పట్టణ మాజీ మహిళా సమైక్య అధ్యక్షురాలు షేక్ మునిరా బేగం, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన డైరెక్టర్ నంబూరి రవి, పాల్గొన్నారు.

తిరువూరు రచయితల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తిరువూరు :

తిరువూరు రచయితల సంఘం సమావేశం ఆదివారం రాత్రి మాజీ సర్పంచ్ అనసూయ నివాసంలో జరిగింది. రచయితల సంఘం గౌరవ అధ్యక్షులుగా పసుపులేటి వెంకయ్య, అధ్యక్షులుగా ఉయ్యూరు అనసూయ, ప్రధాన కార్యదర్శిగా రేపాక రఘునందన్, ఉపాధ్యక్షులుగా విశ్వనాధుని శంకరాచారి, కార్యదర్శిగా ఈడే వెంకట భరత కుమారి, సహకార్యదర్శిగా వజ్రాల ఇందిర, కోశాధికారిగా కోదాటి రజిని ఎన్నికయ్యారు.

నేతాజీ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నందిగామ : నేతాజీ జయంతి సందర్భంగా మండవ వరలక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో నేతాజీ యూత్ ఆదివారం నందిగామ పట్టణం 11వ వార్డు నేతాజీ నగర్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో 65 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా వరలక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మండవ పిచ్చయ్య, నందిగామ జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, చిలుకల్లు జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రిన్సిపల్ స్వర్ణలత పాల్గొని పోటీల్లో ముగ్గులు వేసి పాల్గొన్న ముగ్గురు విజేతల్ని నిర్ణయించారు. ఈ ముగ్గుల పోటీల్లో మొదటి విజేతగా దువ్వల సునీత, ద్వితీయ విజేతగా తోటకూర జ్యోతి, తృతీయ విజేతగా మారం లక్ష్మిని ప్రకటించారు. జడ్పీహెచ్ స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాన్ని కాపాడు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ విగ్రహ నిర్వహణ కమిటీ చైర్మన్ షేక్ దాదా హుస్సేన్, న్యాయవాది, గురునాథం, షేక్ మొహమ్మద్ రసూల్, జంగాల నరసింహారావు గోపాలు, చిన్ను, నాగుల్ మీరా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నందిగామలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నేడు ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు ప్రముఖ ఆరోగ్య సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యమే మహాయోగం ఈ నెల 20వ తేదీ నుండి జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటల నుండి ఆరోగ్య అవగాహన కార్యక్రమం జీ ఛానల్‌లో ప్రసారమవుతుందని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తారని అన్నారు. ఆరోగ్యంతో పాటు ఫిట్నెస్‌కు యోగా సలహాలు అందిస్తారని అన్నారు.

వరుస మరణాలతో భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో క్షణికావేశంలో హత్యలు, అనుమానాస్పద మతులు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఒక జనవరి నెలలోనే వరుసగా ఇలాంటివి ఐదు సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో ఐతవరంలో భర్తను వదిలేసి అదే గ్రామంలో ఉన్న వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఒక మహిళ హత్యకు గురైంది. ఇదే పోలీసు స్టేషన్ పరిధిలో పల్లగిరి గ్రామంలో స్నేహితుల సమక్షంలో ఒక వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఇది హత్య అని కొందరు, కాదు ప్రమాదవశాత్తు మరణిస్తే మిత్రులు భయపడి బహిరంగ ప్రదేశంలో పడేశారని మరికొందరు అంటున్నారు. నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టణంలోని మయూరి థియేటర్ ప్రాంతంలో ఒక యువకుడు లోన్‌యాప్ ద్వారా అప్పులు చేసి తీర్చే దారిలేక ఆత్మహత్య చేసుకున్నాడు. చందర్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ఒక యువకుడు గ్రామ శివారులో బైక్ పై రోడ్ ప్రమాదంలో మృతిచెందాడు. అయితే పోలీసులు ప్రమాదం అని, ఇది ప్రమాదం కాదు రాజకీయ హత్య అని రాజకీయ వర్గాలు, మృతుని బంధువులు ఫోరెన్సిక్ పోస్ట్ మార్టం కావాలని డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పోలీసు స్టేషన్ పరిధిలో వివాహేతర సహజీవనం కారణంగా మహిళా కుమారుడు ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తిని కత్తితో నరికి చంపాడు. ఇలా ఈ ఐదు సంఘటనలు ఈ జనవరి నెలలోనే జరిగాయి. ఈ సంఘటనలో జగ్గయ్యపేట, ఐతవరంలో జరిగిన సంఘటనలపై హత్య కేసులు నమోదు కాగా, పల్లగిరి, ముప్పాళ్ళ గ్రామాలలో సంఘటనలకు సంబంధించి రాజకీయ పార్టీలు మధ్య విమర్శలు ప్రతి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ నెలలోనే నందిగామ, చిల్లకల్లు కేంద్రం మీదుగా జాతీయ రహదారిపై అక్రమ రవాణా జరుగుతున్న భారీ గంజాయి తరలిస్తూ పట్టుబడింది. ఇది కూడా పోలీసులకు అందిన సమాచారం మేరకు పట్టుబడినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే పోలీసులకు అందని సమాచారం మేరకు ఇంకా ఎంత గంజాయి ఈ సబ్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారిపై తరలింపు జరుగుతుందోనని అనుమానం కలుగుతోంది. ఇదే సబ్ డివిజన్ పరిధిలోని చిల్లకల్లు వద్ద కాఫీ కోసం ఆగిన కారు నుంచి డ్రైవర్ సుమారు ఐదు కోట్ల బంగారంతో పరారీ అయ్యారు. కారుకు జీపీఎస్ ఉండటంతో కారును నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో వదిలి వెళ్ళాడు. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు గుండాటా జూదాల విషయంలో సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లో అధికారులు చేతులెత్తేశారనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఈ నేపథ్యంలో అనేక బరుల వద్ద స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పండుగ ముందు కేసులు నమోదు చేస్తాం, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ తరువాత మామూళ్ల వసూళ్లకు ఆరాటపడ్డారనే విమర్శలు వచ్చాయి.

తిరుగు ప్రయాణంతో రద్దీ

- రద్దీగా పిఎన్ బస్‌స్టేషన్...
- ఆర్టీసీ సర్వీసుల కోసం ఎదురు చూపులు
- యథేచ్ఛగా ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీ

ప్రజాశక్తి-విజయవాడ : సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో స్థానిక పిఎన్ బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్ రద్దీ ఏర్పడింది. విద్యార్థులకు సెలవులు అయిపోవడంతో విద్యాసంస్థలకు బయలు దేరారు. అలాగే సంక్రాంతికి సొంతూరుకు వచ్చిన ఉద్యోగుల్లో శనివారం వరకు సెలవులు పెట్టడం, ఆదివారం తిరుగు ప్రయాణం చేయడంతో పిఎన్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సందడి పెరిగిపోయింది. సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకూ ప్రయాణికుల రద్దీ ఒక రకంగా ఉండగా, ఆ తరువాత వచ్చే వారితో బస్‌స్టేషన్ కిటకిటలాడింది. రైల్వే స్టేషన్‌లో కూడా తిరుగు ప్రయాణికులతో విపరీతమైన రద్దీ పెరిగింది. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, ఢిల్లీ, ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులతో స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు రద్దీ కనిపించింది. తిరుగుప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎపిఎస్ఆర్‌టిసి యాజమాన్యం ఏర్పాటు చేసిన సర్వీసులు సరైన సమయానికి అందుబాటులో లేక అత్యధిక మంది ప్రయాణి కులు ప్రత్యమ్నాయ ప్రయివేటు ట్రావెల్స్, కార్లులో అత్యధిక చార్జీలు చెల్లించి, అతి కష్టంపై ప్రయాణించాల్సి వచ్చిందని అనేక మంది ప్రయా ణికులు వ్యక్తం చేశారు. పిఎన్ బస్‌స్టేషన్‌లోని హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వేళ్లే ప్రయాణికులతో ప్లాట్‌ఫారాలు నిండిపోయాయి. తిరుగు ప్రయాణికుల కోసం ఎపిఎస్ఆర్‌టిసి యాజమాన్యం విజయవాడ కేంద్రంగా హైదరాబాద్, చెన్నై, బెంగూరుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు పిఎన్ బస్‌స్టేష్ డిప్యూటీ సిటిఎం నర్రా శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌కు 84 రిజర్వేషన్ సర్వీసులు, అలాగే నాన్ రిజర్వేష్ సర్వీసులు మరో 50, బెంగుళూరు ఏడు, చెన్నై 12 సర్వీసులను ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిప్యూటీ సిటిఎం వెల్లడించారు. అవసరమయితే మరిన్ని సర్వీసులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విజయవాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇ.డి) విజయరత్నం, జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవైదానం, డిప్యూటీ సిటిఎం నర్రా శ్రీనివాసరావు, బస్‌స్టేషన్ సిటిఎం, ఇతర ఆయా డిపోల నుంచి విచ్చేసిన మేనేజర్లు, ట్రాఫిక్ కంట్రోలర్స్ ఆర్టీసి సర్వీసులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. అయితే అధికారులు వెల్లడిస్తున్న సర్వీసులకు, క్షేత్రస్తాయిలో ప్రయాణికుల రద్దీని పరిశీలిస్తే, సరైన సమయములో ఆర్టీసికి వచ్చే రాబడిని రాబట్టుకోవడంలో పూర్తి స్తాయిలో సఫలం కాలేదని, ప్రయివేటు ట్రావెల్స్ హడావుడి, వాటి జోరు విధితం చేస్తుంది. ఆందోళన, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వైపు వెళ్లే ట్రావెల్స్ పిఎన్ బస్‌స్టేషన్ ఎదురు ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసి, మరీ ప్రయాణికులను ఎక్కించుకుంటున్న దృశ్యాలు స్వయంగా ఆర్టీసి అధికారులకు తెలుస్తున్నప్పటికీ, అటు ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఒ, ఆర్టీసి అధికారులు మిన్నకుండిపోయారనే విమర్శలు వెల్లడవుతున్నాయి. ఒక్కొక్క టికెట్ వేలకు వేలు పెట్టేసి ప్రయాణించాల్సి వస్తోందని, ఆర్టీసి సర్వీసులు అందుబాటులో లేక ఈ పరిస్తితి ఎదురవుతుందని బెంగుళూరుకు ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న ఒక ఫ్యాసింజర్ వ్యక్తం చేయడం గమనార్హం. ఆర్టీసి అధికారులు చేస్తున్న హడావుడి, చర్యలు క్షేత్ర స్థాయిలో ఆర్టీసి రాబడిని పెంచేదిగా లేకపోగా, ప్రయివేటు వారికి లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని ఆదివారం రాత్రి బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల ట్రావెల్స్ చేసిన హడావుడి విధితం చేస్తుందని చెప్పక తప్పదు. తిరుగు ప్రయాణికులకు పూర్తి స్థాయిలో ఆర్టీసి సర్వీసులను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని ప్రయాణికుల అవస్థలు వెల్లడిస్తుంది.

నేత్రదానం

ప్రజాశక్తి-కంకిపాడు : నేత్ర దానంతో మరణించిన తరువాత కూడా అమరులుగా జీవించి ఉండొచ్చని కంకిపాడు ప్రభుత్వాసుపత్రి మాజీ చైర్మన్, మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. టిడిపి ఆత్మీయ కుటుంబ సభ్యులు నెక్కలపూడి సుధాకరరావు మృతిచెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడం అభినందనీయమన్నారు. స్థానిక ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల వారు సకాలంలో నేత్రాలను సేకరించి, మరో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించనున్నారని తెలిపారు.

ఎసిసి కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-తాడేపల్లిరూరల్ : ఎసిసి కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని, ఎసిసి కార్మిక పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 47వ రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఏఐఎఫ్టీయూ నాయకులు కె ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు తమకు రావలసిన నష్టపరిహారం కోసం న్యాయ పోరాటం చేస్తున్నారని పాలకులు మాత్రం కార్మికుల సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆవేదన చెందారు. లేబర్ కోర్టు తీర్పు ఇచ్చినా కూడా పరిష్కారం కాలేదు అన్నారు.చట్టపరంగా తమకు రావలసిన నష్టపరిహారం కోసం కార్మికులు పోరాడుతూనే ఉన్నారని, నిర్లక్ష్య వైఖరిని విడనాడి కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దీక్షలలో బి నవనీతం, శారద, డి రమణ, ఎస్ శారమ్మ, ఎస్ ధనమ్మ కూర్చున్నారు. ఈ దీక్షలకు సంఘీభావంగా ఆశీర్వాదం, అంకయ్య, బి సూరి, వై సాంబయ్య, ఎం గురవయ్య, ఎం శివకుమారి, ఎస్.కె ఇమాంబి, టి దుర్గా భవాని, బి గోపి, డి నాగేశ్వరరావు, ఎస్ కే భాష, వై సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఈనెల 14వ తేదీ రోడ్డు ప్రమాదం జరిగి, శనివారం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో మతిచెందిన, తాడేపల్లి పట్టణానికి చెందిన సిపిఎం సభ్యులు మొరతోట సుబ్బారావు (పంపుల సుబ్బారావు) భౌతిక కాయాన్ని ఆదివారం సిపిఎం రాష్ట్ర నాయకులు మున్నూరు భాస్కరయ్య, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి మెరుగు మాల రవి, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి,సిపిఎం కొత్తూరు శాఖ కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి, దొంతి రెడ్డి విజయభాస్కరరెడ్డి, వై బర్నబాస్, బొజ్జ సుబ్బారావులు నివాళులర్పించారు.

ఉల్లి.. చేస్తోంది లొల్లి..

- ధర పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు

ప్రజాశక్తి-గన్నవరం : ఉల్లి చేస్తోంది లొల్లి.. గత 20 రోజులుగా ఎవరిని కదిపినా వినిపిస్తున్న మాట ఇది. ఉల్లిపాయలు పాతవి పెద్ద సైజు కిలో రూ.70 నుంచి రూ.75 వరకు ఉంది. కొత్తవి మధ్య సైజు కిలో రూ.50. చిన్న కిలో రూ.40 ధర పలుకుతోంది. చిల్లర దుకాణాల్లో మరోపది రూపాయలు అదనంగా ధర ఉండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కోయకుండానే కన్నీరు వస్తుందని మహిళ లు అంటున్నారు. వంటకాల్లో ఉల్లిపాయలు వేయడానికి ఆలోచిస్తున్నారు. ఉల్లి వేయకుంటే రుచి ఉండ దని తెలిసినా కొనలేనమిఅవి లేకుండానే కూరలు చేసుకుంటున్నామని మహిళలు చెప్పారు. గన్నవరం మార్కెట్లో హోల్సేల్ దుకాణం ఒకటి ఉంది. చిల్లర దుకాణాలు 26 ఉన్నాయి. 26 గ్రామాల నుంచి చిల్లర దుకాణాలు వ్యాపారులు గన్నవరం వచ్చి ఉల్లి తీసుకెళ్తారు. రేట్లు బాగా పెరగడంతో వాటిని తీసుకెళ్లడానికి ఆలోచిస్తున్నారు. రోజుకు 50 కిలోలు ఉల్లిపాయలు తీసుకెళ్లే చిల్లర వ్యాపారులు పట్టుమని ఐదు కేజీలు తీసుకెళ్లడం లేదని చెప్పారు. కిలో రూ.50 ధర చెబితే జనాలు కొనడానికి ముందుకు రావడం లేదంటున్నారు. గన్నవరం మండలం లో 28 గ్రామాల్లో రోజుకు వంద బస్తాల ఉల్లిపాయలు అమ్ముడు పోయేవి. రేట్లు పెరిగిన తర్వాత రోజు కు 20 బస్తాలు వెళ్లడం లేదు. సామాన్యులు ఎవ్వరూ వాటిని కొనుగోలు చేయడం లేదు. ఆర్థికంగా ఉన్న వారు నెలకు ఆరు కిలోలు వాడితే ఈరేట్లలో రెండుకిలోలు తీసుకెళ్లడం లేదని వ్యాపారి శ్రీనివాసరావు తెలిపారు. హోల్సేల్ దుకాణంలోనూ ఉల్లి వ్యాపారం తగ్గిందంటున్నారు. మహా రాష్ట్ర, కర్నూల్, కర్నాటక, పూన నుంచి ఉల్లిపాయలు రావాలి. మహారాష్ట్రలో వర్షాలకు ఉల్లి పోయింది. కర్నాటకలోనూ అదే పరిస్థితి. కర్నూల్, పూన నుంచి ఉల్లిపాయలు వస్తున్నా కొత్తవి కావడంతో కుళ్లిపోతున్నాయి. నాసిరకమని వ్యాపారులు చెబుతున్నారు. అయినా తప్పని పరిస్థితుల్లో వాటిని దిగుమతి చేసుకుంటే సగానికి కుళ్లి పోయి ఆర్థికంగా నష్టం వస్తుందని తెలిపారు. మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు ఫుల్ గా వస్తేనే మార్కెట్లో రేట్లు తగ్గుతాయని వ్యాపారులు చెప్పారు. గత 15 రోజులుగా ఉల్లిరేట్లు పెరిగాయి. సరకులేకుండా ధరలు ఏవిధంగా తగ్గుతాయని అంటున్నారు. పెద్ద వ్యాపారులు ఉల్లిని బ్లాక్ చేసి ధరలు పెంచారనే విమర్శ ఉంది. ప్రభుత్వం ఉల్లిని దిగుమతి చేసుకుని రైతుబజార్ల ద్వారా జనాలకు తక్కువ ధరలకు ఇప్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఉల్లి పాయలు సరఫరా చేయాలి :దార్నా శివాజీ

కిలో ఉల్లిపాయల రేటు పేదలను ఇబ్బంది పెడుతుంది. సామాన్యులు కొనాలంటే కష్టం. కిలో రూ.10 నుంచి రూ.30 లోపు ధరలకు అందరూ కొంటారు. కానీ రూ.50 నుం చి రూ.70 అంటే పేదలు ఏవిధంగా కొనాలి. ఈపరిస్థితుల్లో ఉల్లి రేట్లు పెరగడం వల్ల కూరల్లో వేయడం లేదు.

అధికారులు తనిఖీలు చేయాలి : ఎలీషా,

ప్రభుత్వం ఉల్లి సరఫరాకు చర్యలు తీసుకోవాలి, రైతు బజార్ల ద్వారా కిలో రూ.30కి వచ్చేలా చూడాలి. ఆ విధమైన చర్యలు తీసుకోవడం లేదు.మార్కెట్లో పాతవి రూ.70, కొత్తవి చిన్నవి రూ.50 అమ్ముతుంటే వినియోగదారులు, పరేషాన్ కు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బ్లాక్ మార్కెట్ పై దాడులు చేయాలని కోరుతున్నాం.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వప్న

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : లైన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు దివిసీమ ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత సంతాన ఉత్పత్తి శిబిరం నిర్వహించారు. నోవా ఐవిఎఫ్ పెర్టీ లిటి సెంటర్ నుంచి డాక్టర్ వై స్వప్న విచ్చేసి 18 జంటలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు దివిసీమ అధ్యక్షులు పూత బోయిన సీతారత్న, సాయిబాబా, ఎస్వీఎల్ విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, కోట రాంబాబు, కాగిత రామారావు పాల్గొన్నారు

గంజాయి మత్తులో యువత

ప్రజాశక్తి- నందిగామ : ఇటీవల నందిగామ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఒకే రోజు రెండు చోట్ల భారీగా గంజాయి పట్టుబడింది. రెండు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కు చెందిన రెండు కార్లు దొరికాయి. పట్టుబడిన గంజాయి రెండు చోట్ల కలిపి రెండు వందల కేజీలకు పైగానే ఉంటుందని సమాచారం. గత కొంత కాలంగా నందిగామ పరిసర ప్రాంతాల్లో గంజాయి తరలిస్తున్న సంఘటనలు చోటు చేసుకోలేదు. అలాగే గతంలో లాక్ డౌన్ సందర్భంగా నందిగామ డిఎస్పీ గా పని చేసిన జివి రమణమూర్తి ఆధ్వర్యంలో అప్పట్లో నందిగామ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో కంచికచర్ల నుంచి గరికపాడు చెక్ పోస్ట్ వరకు టన్నుల కొద్దీ గంజాయిని పట్టుకుని అనేక రకాల వాహనాలను సీజ్ చేశారు. అలాగే పట్టుబడిన గంజాయి తరలిస్తున్న ముఠాలను పట్టుకుని ముద్దాయిలు ఇచ్చిన సమాచారం మేరకు ఇతర రాష్ట్రాలలో గంజాయి అమ్మే వారిని సైతం పట్టుకుని రిమాండ్ కు తరలించేవారు. అయితే ఆ తరువాత నందిగామ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై గంజాయి తరలింపు పూర్తిగా ఆగిపోయింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంజాయి ఇతర మాదక ద్రవ్యాలపై గట్టి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో దాదాపుగా గంజాయి రవాణా స్తంభించిపోయింది. అయితే ఆకస్మాత్తుగా మంగళవారం నాడు నందిగామ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై గంజాయి తరలిస్తున్న రెండు కార్లు వేర్వేరు చోట్ల దొరకడం, వాటిలో దాదాపు రేండు వందల కేజీలకు పైగానే గంజాయి దొరకటం సంచలనం రేపుతోంది. ఈ గంజాయిని మణ్యం ఏరియా, ఒరిస్సా ప్రాంతాలను నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్ కు, అక్కడ నుంచి మహారాష్ట్ర తరలించేందుకు ముఠాలు ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం. అయితే గతంలో నందిగామ పట్టణంలో, కంచికచర్ల మండలం లోని పలు కాలేజీ విద్యార్థులకు గంజాయి సరఫరా చేసే ముఠాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే గతంలో నందిగామకు చెందిన పలువురు యువకులు గంజాయి సేవించి కారు నడుపుతూ నందిగామ శివారు ప్రస్తుత వై జంక్షన్ ప్రాంతంలో ప్రమాదానికి గురై మృతి చెందారు.

ఇటీవల పట్టుబడిన గంజాయి (ఫైల్)

ప్రోత్సాహకాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విస్సన్నపేట : పది సంవత్సరాలుగా మాదిగ పేద విద్యార్థుల సహాయ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన మాదిగ పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తూ వారి భవిష్యత్తును బంగారుమయం చేస్తున్న సంస్థ చాలా క్రమశిక్షణగా పనిచేస్తుంది. సంస్థ అధ్యక్షులు నల్లటి సూరిరాజు మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విస్సన్నపేట, చాట్రాయి, రెడ్డిగూడెం, తిరువూరు మండలాలకు చెందిన మాదిగ పేద విద్యార్థులు చదువుకోటానికి ఆర్థిక స్తోమత లేని ప్రతిభ కలిగిన విద్యార్థులు ఈ నెంబర్లను సంప్రదించాలన్నారు. 9885641456, 9440352445 జనవరి 31 వరకు దరఖాస్తుదారులు సంబంధిత వ్యక్తులను సంప్రదించి వారి వివరాలను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ప్రత్తిపాటి ధనరాజు, కలపాల ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ సన్‌టెక్ పవర్ ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రిలయన్స్ పవర్ లిమిటెడ్ యొక్క పూర్తి అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ ఎన్‌యు సన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన సోలార్ ప్రాజెక్టు ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి బి.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు., కర్నూలు జిల్లాలో బిల్డ్-ఓన్-ఆపరేట్ ప్రాతిపదికన రూ. 10,000 కోట్లతో సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది అని తెలిపారు.. దాదాపు 930 మెగావాట్ల సోలార్ ఎనర్జీ కాంట్రాక్ట్‌తో కూడిన ఈ ప్రాజెక్ట్ లో 465 ఏం డబ్ల్యు/1,860 ఏం డబ్ల్యు హెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈ ఎస్-ఎస్) కాంపోనెంట్‌తో అతిపెద్ద సౌర , బ్యాటరీ శక్తి నిల్వ ప్రాజెక్ట్ గా నిలుస్తుంది అని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ గరిష్టంగా రోజుకు నాలుగు గంటల విద్యుత్ సరఫరాకు హామీ ఇస్తుంది అని తెలిపారు.

ఆహారం వృథాను అరికట్టేందుకు స్విగ్గీ, ఆర్‌హెచ్‌ఎ భాగస్వామ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్విగ్గీ ఆహార పదార్థాలు వధాను తగ్గించే లక్ష్యంతో స్విగ్గీ సర్వ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేరకు ఈ ప్రచారంలో భాగంగా స్విగ్గీ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రాబిన్ హుడ్ ఆర్మీ (ఆర్ హెచ్ ఏ) తో ఒక ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా నగరంలోని ఓ హెూటల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో స్విగ్గీ మార్కెట్ ప్లేస్ విభాగ హెడ్ రోహిత్ కపూర్, ఆర్ హెచ్ ఏ వ్యవస్థాపకులు నీల్ ఘోష్ మాట్లాడుతూ ఆహారం వధాగా పోవడం తగ్గించడం, ఆ సమస్య పరిష్కరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉందన్నారు. ఈ భాగస్వామ్యంలో ఆర్ హెచ్ ఏ, స్విగ్గీ కలసి రెస్టారెంట్ భాగస్వాముల నుండి తక్కువ సేవలందించే కమ్యూనిటీలకు మిగులు ఆహారాన్ని పునఃపంపిణీ చేయడం ద్వారా అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయ న్నారు. ఈ సహకారం ద్వారా, రెండు సంస్థలు 2030 నాటికి 50 మిలియన్ల భోజనాలను అందించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయన్నారు.

సామ్‌సంగ్ 9 కేజీ వాషింగ్ మెషీన్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ సరికొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసినట్లు సంస్థ ఇంచార్జి కె . వర ప్రసాద్ తెలిపారు . నగరంలోని శామ్సంగ్ షోరూం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. తెలివైన, సమర్థవంతమైన లాండ్రీ సొల్యూషన్స్‌లో కొత్త ప్రమాణాలను నిర్దేశించిన 12 కేజీ మోడళ్ల ను తీసుకువచ్చినట్లు తెలిపారు ., కొత్త 9 కేజీ వాషింగ్ మెషీన్ల శ్రేణి అదే శక్తివంతమైన పనితీరు, అధునాతన లక్షణాలను మరింత కాంపాక్ట్ పరిమాణంలో అందిస్తుంది. అని తెలిపారు .తాజా 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లు పెద్ద లోడ్‌లను నిర్వహించడానికి సరైన పరిమాణంలో ఉన్నాయి. అన్నారు .బట్టలు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు వంటి రోజువారీ లాండ్రీకి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తాయనీ అన్నారు.

హక్కుల సాధనకు సంఘటితంగా నిలవాలి

కెడిఎల్‌ఒఎంఎసిఎస్ రజతోత్సవ వేడుకల్లో పలువురు వక్తలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ పరిధిలో పని చేస్తున్న ఎంప్లాయీస్ (కె.డి.ఎల్.ఒ.ఎం.ఎ.సి.ఎస్ ఎల్‌టిడి) సమన్వయంతో ఉత్తమ సేవలందిస్తూ... హక్కుల సాధన కోసం సంఘటితంగా నిలవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆప్‌రేటివ్ స్టోర్స్ లిమిటెడ్ ఎంప్లాయీస్ యూనియ్ (సిఐటియు) 25 సంవత్సరాల (రజతోత్సవ) వేడుకలు స్థానిక బలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముందుగా ఇటీవల కాలంలో మృతి చెందిన సిపిఎం ఆలిండియా కార్యదర్శి సీతారామ్ ఏచూరి, యూనియన్ అభివృద్ధికి విశేష సేవలందించి మృతి చెందినవారికి, ఇటీవల సంభవించిన వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలకు మృతి చెందిన వారికి ఈ సందర్భంగా సంతాపం తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ది లారీ ఓనర్స్ అసోసియేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమ, వ్యాపార సంస్థ ఏదైనా కార్మికులు, వారి సేవలు లేకుండా నడవదని అన్నారు. దేశంలోనే సిఐటియు పర్యవేక్షణలో కెడిఎల్‌ఒఎంఎసిఎస్ ఎల్‌టిడి ఎంప్లాయీస్ యూనియన్ ఎంతో ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. రజతోత్సవ వేడుకలు జరుపుకుంటున్న యూనియన్ సభ్యులకు, నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ది కెడిఎల్‌ఒఎంఎసిస్ ఎల్‌టిడి చైర్‌పర్సన్ కోనేరు వెంకటరమేష్ మాట్లాడుతూ ఎంతో నిబద్ధతతో కూడిన సిఐటియు ఆధ్వర్యంలో కెడిఎల్‌ఒఎంఎసిఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగుల హక్కుల కోసం పని చేస్తుందని, అదే క్రమంలో సంస్థ పురోభివృద్ధికి కూడా కృషి చేయాలన్నారు. మాజీ కార్పొరేటర్, సిఐటియు జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ హక్కులతో పాటు బాధ్యతలు కూడా గుర్తెరిగి ఎంప్లాయీస్ పని చేస్తారని అన్నారు. యూనియన్ అభివృద్ధికి, ఉద్యోగులకు అండగా సిఐటియు నిలుస్తుందని అన్నారు. కెడిఎల్‌ఒఎంఎసిఎస్ సెక్రటరీ జగదీశ్వరరావు, సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎంవి.సుధాకర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి, రాజా, ఎన్‌విఎల్ నర్సింహారావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గంగాధరరావు, వైస్‌ప్రెసిడెంట్స్ ఎస్‌కెఎ కరీమ్, వి.రామమోహనరావు, సహాయ కార్యదర్శులు పి.విజయ్‌కుమార్, డి.రాజా, కోశాధికారి ఎన్‌సిహెచ్ పాపారావు, ముసునూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.

హరిప్రియకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - తిరువూరు :

సావిత్రి బాయి జాతీయ ప్రతిభ పురస్కారం అవార్డు తిరువూరు సిద్దార్థ క్రియేటీవ్ స్కూల్ గణిత ఉపాధ్యాయని గుడిపూడి హరిప్రియకు దక్కింది. రాష్ట్ర స్థాయిలో దక్కిన ఈపురస్కా రాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె ఆదివారం విజయవాడలో అందుకున్నారు. తమ పాఠశాలలో గత 18 ఏళ్ళుగా గణిత ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న హరిప్రియకు జాతీయ ప్రతిభ పురస్కారం లభించడం అభినందనీయమని స్కూల్ కరస్పాండెంట్ ఉప్పలపాటి చక్రపాణి, ఉపాధ్యాయులు తెలిపారు.

హరిప్రియకు పురస్కారం అందజేస్తున్న ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

21న లెనిన్ విగ్రహానికి నివాళి

విజయవాడ : ప్రపంచ ప్రప్రథమ సోషలిస్టు రాజ్యనిర్మాత, విప్లవ యోధుడైన విఐ లెనిన్ శత వర్ధంతి ముగింపు (101వ వర్ధంతి) సందర్భంగా 21న ఉదయం 9.30 గంటలకు విజయవాడ లెనిన్‌సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద నివాళులర్పించనున్నట్లు బుడ్డిగ జమిందార్, కార్ల్ మార్క్స్ ఎంగెల్స్ లెనిన్ విగ్రహాల కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమానికి అందరూ పాల్గొనాలని కమిటీ కోరింది. సాయింత్రం 5 గంటలనుండి అదే స్థలంలో నిర్వహించే వామపక్ష కళా బృందాలచే 'ఆట - పాట - మాట' కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకుడు గోరేటి వెంకన్న పాల్గొంటారని తెలిపింది. వామపక్ష నగర, రాష్ట్ర నాయకులంతా హాజరయ్యే ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని కమిటీ కోరింది.

రచయిత రాం ప్రదీప్‌కు సన్మానం

ప్రజాశక్తి - తిరువూరు : ఇటీవల విస్తృత మహనీయులు అనే పుస్తకాన్ని రాయడంతో పాటు వివిధ సమస్యలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న పట్టణానికి చెందిన రచయిత, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎం.రాం ప్రదీప్‌ను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. స్థానిక సాయి రాఘవ కాలనీలోని రామ్ ప్రదీప్ నివాసానికి ఆదివారం ఎమ్మెల్యే వెళ్లి భార్యాభర్తలను శాలువా కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఎస్ కె. అబ్దుల్ హుస్సేన్, ఎన్. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాంప్రదీప్ దంపతులను సన్మానిస్తున్న ఎంఎల్‌ఎ

శనగపంటకు ఎండు తెగులు

♦ వేరు కుళ్లి ఎండుతున్న పంట ♦ దిగుబడిపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కంచికచర్ల :

శనగపంటకు తెగుళ్లు సోకి పంట ఎండిపోతోంది. దీంతో పంట దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని కంచికచర్ల, వీరులపాడు, మండలాల్లో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో శనగపంట సాగయింది. రబీ పంటగా ఈ పంట నవంబర్, డిసెంబర్లో సాగయింది. కంచికచర్ల మండలంలోనే 6 వేల ఎకరాలకు పైగా పంట సాగుచేశారు. జేజీ 11 రకం విత్తనాలను ఎకరాకు 60 కిలోల చొప్పున విత్తనాలు నాటి సాగుచేశారు. శనగ విత్తనాలు కిలో రూ.70 చొప్పున కొనిసాగు చేశారు. పొలం కౌలు, విత్తనాలు, పంట సాగు, ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చు కలిపి ఎకరాకు 30 వేల వరకు రైతుకు పెట్టుబడి ఖర్చయింది. అయితే మొదట్లో పంట ఆశాజనకంగానే ఉంది. ఎకరాకు 10 క్వింటాళ్ల నుండి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశ పడ్డారు. అయుతే మొదట్లో రైతుల ఆశకూ గండి పడింది. డిశంబర్ నెలలో కురిసిన జల్లులలతో పాటు, వాతావరణ మార్పు ప్రభావం, మంగుగా ఉండటం, భూమిలో సిలింద్రి అనే ఫంగస్ ఉండటం వల్ల శనగపంటకు వెల్టా అనే ఎండు తెగులు సోకింది. పంట పూత దశదాటి, పిందె, కాయ దశకు వచ్చే సరికి ఎండు తెగులు సోకటం వల్ల మొక్క భూమిలో ఉన్న వేరు ఎండిపోయింది. క్రమంగా వేరు కుళ్లి పైకి చేరి ఆకులు ఎండిపోతున్నాయి. దీంతో పూత రాలటం, పిందె గిడసబారి పోతుందని రైతులు అంటున్నారు. పొలంలో ఒకటి, రెండు మొక్కలకు సోకిన తెగులు రోజులు గడిచేకొద్దీ పొలంలో తెరలు, తెరలుగా క్రమంగా అంతటా సోకిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వాతావరణం మంగుగా ఉండటంవల్ల తెగులు తొందరగా వ్యాప్తి చెందుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ తెగులు సోకటం వల్ల ఎకరాకు సగటున 5 నుండి 6 క్వింటాళ్లు కూడా దిగుబడి రాదేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంటకు మద్దతు ధర క్వింటాకు 5,500 ఉంది. బహిరంగ మార్కెట్లో క్వింటా 6,300 వరకు ఉంది. అయితే పంట నాణ్యంగా ఉంటేనే ఆ ధర వస్తుంధి. దిగుబడి తగ్గటం వల్ల పెట్టుబడి ఖర్చులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్థం చేస్తున్నారు. శనగ పంటలో ఎండు తెగులు నివారణకూ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. లీటరు నీటిలో కార్బెండైజైమ్ మందును కలిపి మొక్క వేరు చుట్టూ తడిసేలా పిచికారి చేయాలని, లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి.మొక్కచుట్టూ పిచికారి చేయాలని వ్యవసాయాధికారులు తెలిపారు.

ఎండు తెగులు సోకిన వేరు శనగ పంట

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.